క్లుప్తంగా

విశ్రాంత ఉద్యోగులకు వైద్య సేవలు



శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

కాకినాడ రూరల్: రాయుడుపాలెంలో ఏపీఎస్పీ విశ్రాంత ఉద్యోగులకు సోమవారం ఉచిత వైద్య శిబిరంలో పలు ఆస్పత్రుల వైద్యులు ఉచిత వైద్య సేవలందించారు. విశ్రాంత ఉద్యోగుల భవనంలో మెడికర్ ఆస్పత్రి, స్వాతి హియరింగ్ సెంటరు, క్రితి ఈఎన్‌టీ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య సేవలందించారు. శిబిరాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు లింగం రవి ప్రారంభించారు. కార్యక్రమంలో వరప్రసాద్, నల్ల రాణి, ఏపీఎస్పీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక నగరం కాకినాడ

బోట్‌క్లబ్: ఆధ్యాత్మిక నగరం కాకినాడ అని కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. స్థానిక రామారావు పేటలోని శ్రీమదాంధ్ర వేదశాస్త్ర పరిషత్ 69వ వేద సభకు సోమవారం ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాకినాడ నగరంలో ఎంతో విశిష్టత గల దేవాలయాలు ఉన్నాయన్నారు. సాంబమూర్తినగర్‌లో పాలరాతి వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. క్రమం తప్పకుండా గత 69 సంవత్సరాలు వేద పండితులను ప్రోత్సహించేందుకు వేదశాస్త్ర పరిషత్ చేస్తున్న కార్యక్రమాలను ఆయన కొనియాడారు. అనంతరం ఘనపాఠిలు, క్రమపాఠిలను సత్కరించి నగదు బహుమతి అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీమదాంధ్రవేదశాస్త్ర పరిషత్ అధ్యక్షులు శ్రీరామ్ భగవత్, కార్యదర్శి చల్లా శ్రీనివాస నిరంజన్, కార్యవర్గ సభ్యులు నందమూరి వినోద్, బాదం మధు, జి ఉదయ భానోజీరావు పాల్గొన్నారు.

నాయుడుకు డాక్టరేట్ ప్రదానం



ఏయూ వీసీ ప్రసాదరెడ్డి నుంచి పీహెచ్‌డీ తీసుకుంటున్న నాయుడు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడుకు ఆంధ్రాయూనివర్సిటీలో నిర్వహించిన స్నాతకోత్సవంలో డాక్టరేట్ ప్రదానం చేశారు. కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో తూర్పుగోదావరి జిల్లా రైతులపై జరిగిన అధ్యయనంలో వ్యవసాయ రుణాలు–బ్యాంకుల పాత్రపై సిద్ధాంత వ్యాసం రచించారు. సిద్ధాంత వ్యాసం ఏయూ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ సుదర్శనరావు పర్యవేక్షణలో సమర్పించారు. డాక్టరేట్‌ను రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖ మంత్రి బొత్ససత్యనారాయణ సమక్షంలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా నాయుడును ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, కార్యదర్శి సుగుణారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి అభినందించారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'నాభూమి-నాదేశం'

బోట్‌క్లబ్: బీజేపీ సౌత్ మండల అధ్యక్షులు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో సోమవారం కాకినాడ నగరంలో నా భూమి– నా దేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్ కుమార్ మాట్లాడుతూ ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా మనకు స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా మన దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వారి గుర్తుగా ఢిల్లీ అమృత ఉద్యానవం కడుతున్నారన్నారు. 75 ఎకరాల్లో కడుతున్న ఈ ఉద్యానవనానికి అన్ని గ్రామాల్లోను మట్టిని సేకరిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు దొడ్డి వీరేంద్ర, గొల్లపల్లి శివ, ఏలూరి రాణి, రత్నాల కృష్ణారావు, చెల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలి

కాకినాడ: ఓటర్ల సవరణ–2023 ప్రక్రియలో భాగంగా వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని కమిషనర్, ఈఆర్వో సీహెచ్ నాగనరసింహారావు ఆదేశించారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఓటర్ల జాబిత సవరణ ప్రక్రియ ప్రగతిపై ఆయన ఏఈ ఆర్‌ఓలతో సమీక్షించారు. ఒకే డోర్‌నెంబర్‌లో పది కన్నా ఎక్కువ ఓటర్లు ఉన్న ఇళ్లను గుర్తించి ప్రత్యామ్నాయ డోర్ నెంబర్లు కేటాయించే ప్రక్రియను ఈ నెల 15వ తేదీలోపు పూర్తి చేయాలని సూచించారు. అలాగే పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియకు సంబంధించిన సమాచారాన్ని ఇవ్వాలన్నారు. ఒకే ప్రాంగణంలో మూడు కంటే ఎక్కువ పోలింగ్ స్టేషన్లు ఉన్న ప్రాంగణాలను గుర్తించి నివేదిక సిద్ధం చేయాలని సూచించారు. రాజకీయ పార్టీలతో చర్చించిన అనంతరం ఆ పోలింగ్ స్టేషన్లను సర్దుబాటు చేసే ప్రక్రియ చేపడతానన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ ఎంవీ మురళీకృష్ణ, డీసీపీ హరిదాసు, ఏసీపీ నాగశాస్త్రులు, పలువురు ఏఈ ఆర్వోలు, ఈఆర్వోలు పాల్గొన్నారు.

భవితకు మరింత భరోసా

- ప్రాథమిక బడుల్లో భవిత కేంద్రాలు విలీనం
- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్యాబుద్ధులు
- అందరితో సమానంగా నదుపాయాలు



భవిత కేంద్రంలో చిన్నారితో వ్యాయామాలు చేయిస్తున్న ఫిజియోథెరపిస్టు

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): ప్రత్యేక అవసరాల గల పిల్లలకు ఇంటికే పరిమితం కాకుండా వారిలో మానసికంగా, శారీరకంగా ఎదుగుదల తీసుకురావాలనే లక్ష్యంతో భవిత కేంద్రాల ద్వారా ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోంది. తాజాగా ఇప్పుడు సమీప పాఠశాలల్లో విద్య అభ్యసనకు సిద్ధమైంది. శారీరక, మానసిక వైకల్యానికి గురైన పిల్లలకు ఇప్పటి వరకూ ప్రత్యేకంగా విభజించారనే భావన చిన్నారుల్లో కలగకుండా ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఈ మేరకూ అమలు కూడా ప్రారంభమైంది. ప్రాథమిక పాఠశాలల సమీప భవిత కేంద్రాలను వాటితో అనుసంధానించారు. సాధారణ పిల్లలతో కలిసి వీరు విద్యాబుద్ధులు నేర్చుకోవడం ద్వారా వారిలో ఆలోచనలు వృద్ధి చెందుతాయనే భావనతో ఈ ఏర్పాట్లు చేశారు. మాటలు రాని మానసికంగా ఎదుగుదల లేని, నడవలేని పిల్లలు ఇళ్లలో ఉండి మరింత మానసికంగా కుంగిపోకుండా వారిని భవిత కేంద్రాల ద్వారా విద్యను అందించారు. చిన్నారుల వైకల్యాలు గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తునే సాధారణ విద్యను బోధించారు. ఈ తరహా విద్య, శిక్షణలో వృద్ధి చెందిన వారిని ఆపై సాధారణ పాఠశాలల్లో చేర్పించారు. ప్రస్తుతం పిల్లలు వేర్వేరు కాకుండా వారిలో అందరూ సమానమనే భావనను పెంపొందింపజేసేందుకు సాధారణ విద్యార్థులతోనే ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వీరికి చదువు చెప్పించేలా చర్యలు తీసుకుంది. దీని కోసం మండలానికి ఒక పాఠశాల ఎంపిక చేసి భవిత కేంద్రాల బాలలను ఆయా పాఠశాలల్లో విలీనం చేశారు. అక్కడ ఐఈఆర్‌టీలతో పిల్లలకు విద్య బోధిస్తారు. అక్కడే మధ్యాహ్న భోజనం, విద్యాకానుక కిట్లు, విద్యాదీవెన వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఫిజియోథెరపిస్టులు, వ్యాయామం, స్పీచ్ థెరపీ, యోగా తదితర శిక్షణ ఇస్తారు. ఐఈఆర్‌టీలు, ఫిజియోథెరపిస్టులు వారి పర్యవేక్షణలో పనిచేయాల్సి ఉంటుందని పేర్కొంటున్నారు.

ప్రశస్త యాప్‌లో దివ్యాంగుల వివరాలు నమోదు

ప్రశస్త యాప్‌లో పిల్లల వివరాల నమోదుకు సిబ్బంది సిద్ధమవుతున్నారు. వైకల్యాలను గుర్తించేందుకు 63 ప్రశ్నలు రూపొందించారు. 2016 దివ్యాంగుల చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాల గుర్తింపునకు ప్రశస్త యాస్ ఉపయోగపడుతోంది. భవిత కేంద్రాల్లో ఐఈఆర్టీలు, జిల్లా పరిషత్ పాఠశాలల్లో ప్రత్యేక విద్యాబోధకులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

జిల్లాలో భవిత కేంద్రాల వివరాలు

భవిత కేంద్రాలు	21
గుర్తించిన విభిన్న ప్రతిభావంతులు	3633
పాఠశాలల్లో, భవిత కేంద్రాల్లో ఉన్నవారు	494
సేవలు పొందుతున్నవారు	1094
ఫిజియోథెరిపిస్టులు	06
ఐఈఆర్‌టీలు	33
ఆయాలు	21

అనుసంధానం చేశాం



ప్రభుత్వ ఆదేశాల మేరకు సమీప ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేశాం. చిన్నారులకు ప్రత్యేక శిక్షణ ఇస్తునే సాధారణ విద్య బోధిస్తాం. వైకల్యం కలిగిన పిల్లలో సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సహిత విద్య తోడ్పడుతుంది. వైకల్యానికి అనుగుణంగా పరికరాలు ఉపయోగించి వారికి లైఫ్ స్కిల్స్ నేర్పించడం ద్వారా తోటి విద్యార్థులతో కలిసి చదువుకునేలా కృషి చేస్తున్నాం. జిల్లాకు 250 ట్యాబ్‌లు మంజురు అయ్యాయి. వాటిని త్వరలో అందజేస్తాం. – జి.నాగమణి, ఇన్‌చార్జి డీఈఓ, కాకినాడ జిల్లా

బాలాత్రిపుర సుందరి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేయిస్తున్న ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి

బోట్‌క్లబ్: స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులుగా ఎన్నికైనవారు సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. సభ్యులుగా పెద్ది రత్నాజీ, నాళం అండాళ్లు, సలాది ఉదయలక్ష్మి, మేడపాటి శ్రీనివాసవెంకటకృష్ణారెడ్డి, పెంకె రవికుమార్, ధర్మాడి సత్యవతి, వాసంశెట్టి వరలక్ష్మి, గొల్లపల్లి సుభాషిణి, స్వయంవరపు వరలక్ష్మి, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకులు చెరుకూరి సుబ్రహ్మణ్యం ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా పెద్ది రత్నాజీని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సభ్యులు తొలుత అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యువతలో ఉత్తేజం నింపిన 'చికాగో ప్రసంగం'



నివాళులు అర్పిస్తున్న బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం

కాకినాడ రూరల్: చికాగోలో 1893 సెప్టెంబరు 11న సర్వమత సమ్మేళనంలో స్వామి వివేకానంద ఉపన్యాసం భారతదేశ యువతలో ఉత్తేజం నింపిందని జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యుడు సి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వామి వివేకానంద చికాగో ప్రసంగం 130వ వార్షిక దినోత్సవాన్ని పురస్కరించుకుని బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ సనాతన మతాలకు, సమస్త ధర్మాలకు తల్లి లాంటిది సనాతన ధర్మమని స్వామి వివేకానంద ఉద్బోధించారన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, మీనాక్షి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నబాబుకు కృతజ్ఞతలు



ఎమ్మెల్యే కన్నబాబును సత్కరిస్తున్న గైగోలుపాడు లూథరన్ చర్చి సభ్యులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట గైగోలుపాడులోని లూథరన్ చర్చి పరిధిలోని క్రైస్తవులు సోమవారం ఎమ్మెల్యే కురసాల కన్నబాబును కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. రమణయ్యపేట వైద్యనగర్‌లోని క్యాంపు కార్యాలయానికి భారీగా వచ్చిన క్రైస్తవులు కన్నబాబును సత్కరించారు. ఎప్పటినుంచో చర్చిలో ఉన్న సమస్యలను పరిష్కరించడంతో పాటు కొత్తగా కమిటీ ఏర్పాటుకు ఎమ్మెల్యే కన్నబాబు సహకరించారని ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు తెలియజేశారు. ఎమ్మెల్యేతో పాటు ఎమ్మెల్సీ పద్మశ్రీ, ఏఎంసీ చైర్మన్ గీసాల శ్రీను, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిక నరసింహమూర్తి తదితరులను వారు సత్కరించారు. కడియాల చిన్నా, గగారిన్ తదితరులు పాల్గొన్నారు.

సంగీత శిక్షణ కేంద్రం రేపు ప్రారంభం

కాకినాడ కల్చరల్: స్థానిక మెయిన్ రోడ్డులోని టౌన్ హాల్ ప్రాంగణంలో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10 గంటలకు లక్కరాజు శేషకుమారి స్మారకార్థం సంగీత శిక్షణా కేంద్రం ప్రారంభిస్తున్నామని గానసభ కార్యదర్శి పి.రామకృష్ణ తెలిపారు. కలెక్టర్ డాక్టర్ కృతికా శుక్లా శిబిరాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. విద్యార్థులకు గాత్రం, వయొలిన్, వేణువు, మృదంగం, వీణలో శిక్షణ ఇస్తామని తెలిపారు. అసక్తి ఉన్న వారు 99497 99299 సంప్రదించాలని ఆయన కోరారు

బాలింత ఆచూకీ లభ్యం

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్ ప్రసూతి విభాగం నుంచి వెళ్లిపోయిన బాలింత గొర్ల వరలక్ష్మి క్షేమ సమాచారం లభ్యమైంది. దివ్యాంగురాలైన ఆమె తన బంధువుల ఇంటికి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు వెదకడంతో ఆమె నగరంలోని పీఆర్ కళాశాల రోడ్‌లో సంచరిస్తూ కనిపించింది. తన బంధువుల ఇంటి నుంచి వస్తున్నట్టు సైగలతో కుటుంబ సభ్యులకు వివరించింది. ఆమెను ఇంటికి తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు తిరిగి జీజీహెచ్‌కి తీసుకొచ్చి చేర్చారు.

బంద్ విఫలం



కరపలో రాస్తారోకో చేస్తున్న టీడీపీ నాయకులు

కరప: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు విధించిన 14 రోజుల జ్యుడిషియల్ రిమాండ్‌ను నిరసిస్తూ ఆ పార్టీ రాష్ట్రశాఖ పిలుపుమేరకు సోమవారం నిర్వహించిన రాష్ట్ర బంద్ విఫలమైంది. కరప మండలంలో టీడీపీ నాయకులు రెండు మూడు గ్రామాల్లో కొద్దిసేపు రాస్తారోకో చేసి, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలను మూయించినా ఆ తర్వాత గంటలోనే యథావిధిగా పని చేశాయి. ఈ బంద్‌కు జనసేన పార్టీ నాయకులు మద్దతు తెలపకపోవడం విశేషం. ఆర్టీసీ బస్సులు అరకొరగా తిరిగినా, ఆటోలు యథావిధిగా తిరగడంతో ప్రయాణికులు ఏవిధమైన ఇబ్బంది లేకుండానే ప్రయాణాలు సాగించారు. ప్రైవేటు పాఠశాలలకు శెలవు ప్రకటించినా, ప్రభుత్వ పాఠశాలలు యథావిధిగా పనిచేశాయి. గ్రామాల్లో బంద్‌ప్రభావం కనిపించలేదు. వాణిజ్య బ్యాంక్‌లు, పీఏసీఎస్ కార్యాలయాలు రెండు గంటలు బంద్ చేసి, తర్వాత తెరుచుకున్నాయి. మండలంలో టీడీపీ తలపెట్టిన బంద్ అంతంతమాత్రంగానే జరిగింది.

కాకినాడ రూరల్: కాకినాడ రూరల్ నియోజవర్గంలో బంద్ ప్రభావం పెద్దగా చూపలేదు. బస్సులు మామలుగా తిరిగాయి. కొన్ని చోట్ల స్వచ్ఛందగా దుకాణాలు మూసివేశారు. టీడీపీ నాయకుడు పిల్లి సత్యనారాయణ, అనుచరులు వలసపాకల జంక్షన్ నుంచి సర్పవరం జంక్షన్ వరకు నడుచుకుంటూ దుకాణాలు మూయించారు. టీడీపీ నాయకులు పెంకే శ్రీనివాస బాబా, వాసిరెడ్డి ఏసుదాసు తదితరులు అచ్చంపేట జంక్షన్‌లో బైక్ ర్యాలీ నిర్వహించి బంద్‌కు విజయవంతం చేయాలని వర్తకులను కోరారు. కొన్ని ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్‌లో పాల్గొనగా ప్రభుత్వ పాఠశాలలు కొనసాగాయి.

కాకినాడ క్రైం: తెలుగుదేశం అధినేత నారా చంద్రబాబు నాయుడు అరెస్టుతో హడావుడి చేసిన పసుపు దండు ఆశలపై జనం నీళ్లు చల్లేశారు. ఆ పార్టీ అధినాయకత్వం పిలుపునిచ్చిన బంద్‌ను ప్రజలు ఏ కోశాన లెక్కచేయలేదు. సోమవారం ఉదయాన్నే కార్యకర్తలమంటూ కొందరు కాకినాడ నగరంలో హడావుడి చేసి దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలను మూసివేశారు. వారు వెళ్లిన వెంటనే మళ్లీ తెరచారు. గస్తీ కాస్తున్న కొందరు పోలీసుల పక్కన నించొని పలువురు కార్యకర్తలు ఫొటోలతో హడావుడి చేశారు. అంతేకాని బంద్ జరగలేదు. మొత్తానికి బంద్ నీరుకారిపోవడంతో కేడర్‌లో ఉత్సాహం ఆవిరైపోయింది.

సత్వర పరిష్కారానికే 'స్పందన'

- మేనేజర్ కర్రి సత్యనారాయణ
- కార్పొరేషన్‌లో డయల్ యువర్ కమిషనర్, స్పందన



స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కార్పొరేషన్ మేనేజర్ సత్యనారాయణ

కాకినాడ: ప్రజలు ఎదుర్కొనే స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు సత్వరమే పరిష్కరించేందుకే ప్రభుత్వం డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహిస్తోందని కాకినాడ నగర పాలక సంస్థ మేనేజర్ కర్రి సత్యనారాయణ చెప్పారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్‌యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమాలను నిర్వహించారు. కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు ఆదేశాల మేరకు మేనేజర్ కర్రి సత్యనారాయణ ప్రజల నుంచి వచ్చిన వినతులు స్వీకరించారు. డయల్ యువర్ కమిషనర్ ద్వారా 11 మంది , స్పందన ద్వారా ఏడుగురు వివిధ సమస్యలపై మేనేజర్‌కు సమస్యలు విన్నవించారు. టిడ్కో ఇళ్ళు, డబుల్ అసెస్మెంట్లు, పార్కుల అభివృద్ధి, పారిశుధ్యం, మౌళిక సదుపాయాల కల్పన, వంటి ఆయా సమస్యలను మేనేజర్ దష్టికి తీసుకురాగా, సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన సంబంధిత అధికారులకు సూచించారు. మేనేజర్ మాట్లాడుతూ ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరించిన తరువాత వాటి వివరాలను సంబంధిత ఫిర్యాదుదారునికి ఫోన్ ద్వారా తెలియజేస్తున్నామని, వారి స్పందనను కూడా తెలుసుకుంటున్నామన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఈ ప్రక్రియను అన్ని వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎస్ఈ పి.సత్య కుమారి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ సిరిల్, ఈఈ మాధవి, టీపీఆర్వో కృష్ణమోహన్, వివిధ విభాగాల అధికారులు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

హిందీ భాషకు సముచిత స్థానం

కాకినాడ కల్చరల్: హిందీ భాషకు ప్రపంచ భాషాలలో సముచిత స్థానం ఉందని సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక వ్యవస్థాపకులు దాడి చంద్రశేఖర్ అన్నారు. హిందీ భాషా దినోత్సవాన్ని పురష్కరించుకొని వేదిక ఆధ్వర్యంలో శాస్త్రి కళాప్రాంగణంలో సోమవారం విద్యార్థులకు హిందీ దివాస్ మహత్వ క్విజ్, వక్తృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఉత్తమ హిందీ ఉపాధ్యాయులకు పురస్కారాలు అందించారు. పదో తరగతి పరీక్షలలో హిందీ సబ్జెక్టులో 95 శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇచ్చారు. లో ఆర్‌వీవీ రాజా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఈఈ మాధవికి సత్కారం



మాధవిని అభినందిస్తున్న కమిషనర్, అధికారులు

కాకినాడ: కాకినాడ నగరపాలక సంస్థలో డీఈగా పని చేస్తూ ఈఈగా పదోన్నతి పొందిన ఎంవీకే మాధవిని కార్పొరేషన్ యంత్రాంగం అభినందించింది. కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం ఈఈ మాధవిని నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, ఇతర అధికారులు సత్కరించారు. విధి నిర్వహణలో ఈఈ మాధవి సేవలను కొనియాడారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, ఎంహెచ్‌ఓ డాక్టర్ పృథ్వీ చరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్‌ఓ మానే కృష్ణమోహన్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, అధికారులు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.

పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతిపత్రాలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగి పగడాలపేటకు చెందిన రెండు వేల చదరపు గజాల శ్మశాన భూమిని కొందరు వ్యక్తులు ఆక్రమించుకొని అమ్మకాలు నిర్వహిస్తున్నారని, వారి నుంచి భూమిని కాపాడి పగడాలపేట గ్రామానికి అప్పగించాలని ఆ గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతి పత్రం అందజేశారు. శ్మశాన భూమిని సర్వే నిర్వహించి, భూమిని కొనుగోలు చేసిన వ్యక్తుల నుంచి భూమిని స్వాధీనం చేసుకోవాలని పెరుమాళ్ల సత్యం , ఎస్.ఇమాన్యుల్, ఎస్.సత్తిబాబు, జి. కుమార్‌రాజా, గరికిన వేమన, మేరుగు పెదసత్తిబాబు తదితరులు కలెక్టర్‌ను కోరారు.

కాకినాడ నగరంలోని పాతబస్టాండ్‌లో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌ను ప్రజల వినియోగార్థం అందుబాటులో ఉంచాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘాల ప్రతినిధులు సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి వినతిపత్రం అదించారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో దళిత సంఘాల నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు, ఎస్.రమేష్, కె.శ్రీనివాస్, నూకరాజు, తాళ్లూరి రాజు, కింగ్ తదితరులు ఉన్నారు.

కాకినాడలోని నేషనల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్, యశోద కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థినులపై కళాశాల మేనేజింగ్ డైరెక్ట్, సిబ్బంది అసభ్యకర పదజాలంతో దూషిస్తున్నారని వారిపై దిశ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాకు విద్యార్థులు వినతి పత్రం అందజేశారు. ఈ కళాశాలల్లో కనీస సదుపాయాలు లేవని, కనీసం వాచ్‌మెన్, వార్డెన్, స్లీపర్ కూడా లేకుండా ఆ పనిని కూడా విద్యార్థులకే డ్యూటీలు వేసి చేయిస్తున్నారన్నారు. నెల రోజుల క్రితం కనీస సౌకర్యాలు కల్పించాలని, భోజనం నాణ్యత పెంచాలని ఎండీకి చెప్పినా పట్టించుకోలేదన్నారు. సమస్యలు పరిష్కరించకుండా విద్యార్థులతో అసభ్యకరంగా మాట్లాడుతూ, నీచంగా సిబ్బంది శ్రీనివాస్ చూస్తున్నాడని కలెక్టర కృతికా శుక్లాకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సీహెచ్ సాహిత్, రాజేష్, టి.రాజా, విద్యార్థినులు కుందన, కీర్తి, శివప్రియ, గాయత్రి, మేరీ, మమత, సృజన, కల్యాణి, మేఘన, బాల, శిరీష, లావణ్య, రాధిక, మాధురి, స్నేహ, రుతు, దివ్యవ, హర్షిని తదితరలు వారి తల్లిదండ్రులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

గణేశ్ నిమజ్జన ప్రదేశాల పరిశీలన



జగన్నాథపురంలో నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న నగర గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు

బోట్‌క్లబ్: గణేశ్ నవరాత్రుల అనంతరం ఈ నెల 27, 28 తేదీల్లో జరిగే నిమజ్జనోత్సవంలోని సమస్యలు పరిష్కరించాలని నగర గణేశ్ ఉత్సవ సమితి సభ్యులు అధికారులను కోరారు. సమితి సభ్యులు సోమవారం జగన్నాథపురంలోని నిమజ్జన ప్రదేశాలను పరిశీలించారు. 1989 నుంచి 2018 వరకూ జగన్నాథపురం వంతెనలు మధ్య వినాయకసాగర్‌లో నిమజ్జనం చేస్తున్నారు. కరోనా కారణంగా గత మూడు సంవత్సరాలుగా నగరంలోని 13 ప్రాంతాల్లో నిమజ్జనోత్సవం చేస్తున్నారు. నిమజ్జన ప్రాంతంలో ఉన్న సమస్యలను మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. ఇష్టానుసారంగా నిమజ్జనాలు చేయడం ద్వారా ప్రమాదాలు బారినపడే అవకాశం ఉందని, ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిన ప్రాంతాల్లో నిమజ్జనం చేసేలా చర్యలు తీసుకుంటామని సమితి కో ఆర్డినేటర్ దూసర్లపూడి రమణరాజు తెలిపారు. కన్వీనర్లు మాలకొండయ్య, ఆర్.వేంకటేశ్వరరావు, సభ్యులు అయోధ్య రామయ్య, సురేష్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఐవో రత్నకుమార్



కలెక్టర్ కృతికా శుక్లాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి రత్నకుమార్

కాకినాడ సిటీ: కాకినాడ జిల్లా ఇమ్యూనైజేషన్ (డీఐవో) అధికారిగా విశాఖపట్నం కేజీహెచ్ నుంచి పదోన్నతిపై నియమితులైన డాక్టర్ కె.రత్నకుమార్ సోమవారం కలెక్టర్ కృతికా శుక్లాను, జేసీ ఎస్ ఇలక్కియలను మర్యాదపూర్వకంగా కలిశారు.

జాబ్‌మేళా నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

బాలాజీచెరువు: నేషనల్ కెరీర్ సర్వీస్(ఎన్‌సీఎస్) ద్వారా నిర్వహించే మెగా జాబ్‌మేళాల నిర్వహణకు సంబంధించి టెంట్‌లు, స్నాక్స్, కరపత్రాలు వంటివి సరఫరాకు టెండర్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పనాధికారి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఉపాధి కార్యాలయంతో నిర్వహించే జాబ్‌మేళాతోపాటు వివిధ ప్రాంతాలలో నిర్వహించే వాటికి సరఫరా చేయాలని, టెండర్ దరస్తులు తమ కార్యాలయంలో ఉన్నాయని తెలిపారు. ఈ నెల 15వ తేదీన దరఖాస్తులను పరిశీలన చేసి ఎంపిక చేస్తామని సూచించారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపిన అభ్యర్థులు

కాకినాడ సిటీ: కాకినాడ స్పందన కార్యక్రమంలో ఉద్యోగాల కోసం దరఖాస్తులు చేసుకున్న తొమ్మిది మందికి వికాస ద్వారా ఉద్యోగాలు కల్పించడంతో సోమవారం ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు కలెక్టర్ కృతికా శుక్లాను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. వీరికి ముత్తూట్ ఫైనాన్స్‌లో ప్రొబిషనరీ ఆఫీసర్స్, కస్టమర్ కాల్ ఎగ్జిక్యూటీవ్, ఇంటర్న్‌షిప్, ఖజానా జ్యూవెలరీలో సేల్స్ ఎగ్జిక్యూటీవ్‌గాను, సత్యదేవి ప్రాజెక్టు లిమిటెడ్‌లో అకౌంటెంట్‌గాను వివిధ సంస్థల్లో రూ.10 వేలు నుంచి రూ.18 వేలు వరకు జీతంతో ఎంపిక చేసినట్టు వికాస పీడీ కె.లచ్చారావు వివరించారు. జేసీ ఇలక్కియ, డీఆర్వో కె.శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: స్థానిక జగన్నాథపురం 20వ డివిజన్‌కు చెందిన చిందాడి సింహాచలం విద్యుత్‌షాక్‌తో మరణించగా అతని కుటుంబానికి రూ.3లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. ఈ చెక్కును కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి సోమవారం మృతుని భార్య మరియాకు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కొడ చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగరాధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఏఎంసీ చైర్‌పర్సన్ పసుపులేటి వెంకటక్ష్మి, మాజీ డిప్యూటీ మేయర్ మీసాల ఉదయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు నల్లబెల్లి సుజాత, కొప్పనాతి సత్యనారాయణ, రోకళ్ల సత్యనారాయణ, సంగాని నందం తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపురం ఎస్సైగా షరీఫ్

కాకినాడ రూరల్: తిమ్మాపురం ఎస్సైగా కె.షరీఫ్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ నుంచి బదిలీపై షరీఫ్ తిమ్మాపురం వచ్చారు. తిమ్మాపురం ఎస్సైగా పని చేసిన నాగార్జున రాజు జగ్గంపేట బదిలీపై వెళ్లారు.

పోలింగ్ స్టేషన్ల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న ఆర్డీవో

కాకినాడ: కాకినాడ రూరల్ నియోజకవర్గం ఎల్క్టోరిజిస్ట్రేషన్ అధికారి, ఆర్డీవో ఎన్‌వీ సత్యనారాయణ కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం, చీడిగ, కొవ్వాడ, రేపూరు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలింగ్ కేంద్రాలు పరిశీలిస్తున్నామన్నారు. ప్రాథమిక సౌకర్యాలకు సంబంధించి ముఖ్యంగా విభిన్న ప్రతిభావంతులకు అవసరమైన ర్యాంపులు, తాగునీరు, విద్యుత్ వంటి సౌకర్యాలు ఏర్పాట్లను పరిశీలించినట్టు చెప్పారు. ఆర్డీవో వెంట రూరల్ తహసీల్దార్ మురార్జీ, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రేపు ఎస్‌జీఎఫ్ఐ జిల్లాస్థాయి ఎంపికలు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడా సమాఖ్య జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం జిల్లాస్థాయి క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు సంఘ కార్యదర్శి ప్రసాద్ సోమవారం తెలిపారు. కాకినాడలోని జిల్లా క్రీడామైదాంలో ఎంపికలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల విద్యార్థులు ఈ ఎంపికలకు అర్హులన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి జి.నాగమణి అనుమతితో రెజ్లింగ్, హాకీ, చెస్, స్విమ్మింగ్, విలువిద్య(ఆర్చరీ) అండర్–14, 17 విభాగాల్లో ఎంపికలు చేస్తారని, ఆసక్తి ఉన్నవారు హాజరు కవాలని, వివరాలకు 94908 96851 నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.